మధ్య తరగతి మందహాసం



కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లాలో ప్రధానంగా మూడు నాలుగు వర్గాలకు ప్రయోజనం కలిగించనుంది. ఆదాయ పన్ను పరిమితిని పెంచడంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉద్యోగులు, పెన్షనర్లు, అలాగే వ్యాపార వర్గాలకు మేలు జరగనుంది. వారిపై ఆదాయ పన్నుభారం తగ్గనుంది. అదేవిధంగా పీఎం కిసాన్ కార్డులు కలిగిన రైతులకు రుణ పరిమితి పెంచడం వల్ల జిల్లాలో వారికి కూడా అధిక మొత్తం రుణాలు అందనున్నాయి. మరోవైపు ఎంఎస్ఎంఈలకు సైతం కొత్త బడ్జెట్‌లో రుణ పరిమితిని పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫలితంగా జిల్లాలో ఇప్పటికే ఉన్న ఎంఎస్ఎంఈ యూనిట్ల యజమానులతో పాటు కొత్తగా ఏర్పాటు చేయనున్న వారికి కూడా రెట్టింపు రుణాలు అందే అవకాశాలు ఏర్పడ్డాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- ఐటీ పరిమితి పెంపుతో ఉద్యోగులు, పెన్షనర్లు, వ్యాపారులకు మేలు
- రైతులు, చిన్న పారిశ్రామికవేత్తలకు రుణ పరిమితి పెంపు
- కేంద్ర బడ్జెట్‌తో మూడు నాలుగు వర్గాలకు ప్రయోజనం

ఐటీ పరిమితి పెంపుతో ఉద్యోగులు, పెన్షనర్లు, వ్యాపారులకు మేలు



జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 30 వేల మంది ఉన్నారు. అలాగే 17,500 మంది పెన్షనర్లు ఉన్నారు. బీఎస్ఎన్ఎల్, రైల్వే, పోస్టల్, షార్, కేంద్రీయ విద్యాలయాలు, జాతీయ సంస్కృతి వర్సిటీ, ఐఐటీ, ఐసర్ వంటి సంస్థల్లో పది వేల మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పనిచేస్తుండగా అంతే మంది పెన్షనర్లు ఉన్నారు. సుమారు 70 వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లలో 50 శాతం మందికి పైగా అంటే 35 వేల మంది రూ.లక్షకు పైగా వేతనం లేదా అంతే మొత్తంలో పెన్షన్ పొందేవారున్నారు. కొత్త బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితి రూ.7.75 లక్షల నుంచి ఏకంగా రూ.12 లక్షలకు పెంచుతూ కేంద్రం నిర్ణయించింది. దీంతో 30 వేల నుంచి 35 వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఆదాయ పన్ను పరిమితి పెంపు వల్ల లబ్ధి పొందడానికి అవకాశం ఏర్పడింది. వీరిపై ఆదాయ పన్ను భారం గణనీయంగా తగ్గనుంది. అదేవిధంగా జిల్లాలో రూ.12 లక్షల వరకూ ఆదాయం పొందే వ్యాపారులు సైతం దీనివల్ల లబ్ధి పొందనున్నారు.

10 వేలకు పైగా చిన్న పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం



సూక్ష్మ, స్వల్ప, మధ్య తరహా పరిశ్రమలు నడిపే పారిశ్రామికవేత్తలకు, అలాంటి చిన్న తరహా యూనిట్లు ఏర్పాటు చేసే వారికి ఇప్పటివరకూ ప్రభుత్వం రూ.5 కోట్ల వరకూ రుణాలు అందిస్తోంది. అయితే కొత్త బడ్జెట్‌లో ఆ రుణ పరిమితిని రెట్టింపు చేస్తూ రూ.10 కోట్లకు పెంచింది. జిల్లాలో ప్రస్తుతం 10,426 ఎంఎస్ఎంఈ యూనిట్లు నడుస్తున్నాయి. వీటిని నడుపుతున్న పారిశ్రామికవేత్తలు ఇకమీదట రూ.10 కోట్ల వరకూ రుణాలు తీసుకునే అవకాశమేర్పడింది. ఇప్పటికే రుణాలు తీసుకుని ఉంటే వాటిని క్లియర్ చేయగానే ఈ పెంచిన మొత్తాలు రుణాలుగా పొందే వీలుంది. అలాగే రుణ బకాయిలు లేని వారు, కొత్తగా యూనిట్లు పెట్టే వారికి కూడా ఈ రుణ సదుపాయం మేలు చేయనుంది. ఈ నిర్ణయం జిల్లాలో చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు గణనీయంగా తోడ్పాటునందించే అవకాశాలున్నాయి.

1.60 లక్షల మంది రైతులకు పెరగనున్న రుణ పరిమితి



కేంద్ర బడ్జెట్‌లో పీఎం కిసాన్ కార్డు కలిగిన రైతులకు రుణ పరిమితిని ఇపుడున్న రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో పీఎం కిసాన్ క్రెడిట్ కార్డు కలిగిన రైతులు 1,59,638 మంది ఉన్నారు. వీరికి ఇకపై పంట రుణాల మొత్తాలు రూ.5 లక్షల వరకూ తీసుకునే అవకాశం రానుంది. దీనివల్ల పంటలకు అధికమొత్తం పెట్టుబడులు పెట్టడానికి వీలు కలగనుంది. ఆ మేరకు పంట దిగుబడులు, ఆదాయాలు కూడా రైతులకు గణనీయంగా పెరిగే అవకాశముంది.

వికసిత భారత్‌కు రోడ్ మ్యాప్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్‌కు ఒక రోడ్ మ్యాప్. ప్రధాని మోదీ దార్శనికతకు, దేశ స్వావలంబన, అభివృద్ధి, ప్రజా శ్రేయస్సుకు నిదర్శనం. రైతుల సంక్షేమానికి బడ్జెట్ పెద్దపీట వేసింది. మధ్య తరగతికి ఎంతో ఉపశమనం కల్పించింది. మహిళలు, యువత సాధికారతకు పట్టుగొమ్మ. స్టార్టప్‌లకు మంచి ప్రోత్సాహాన్నిచ్చింది.

- జి.భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు



నిరాశాజనకంగా బడ్జెట్



కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. వేతన జీవులకు అనుకూలంగా లేదు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే వరాల బడ్జెట్‌గా మారింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్న అంశం ప్రకటించకపోవడం, విశాఖ ఉక్కు పరిశ్రమకు అవసరమైన గనులను కేటాయించకపోవడం, పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం చూస్తుంటే ఇది కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్‌గా నిలుస్తోంది.

- కందారపు మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

మధ్య తరగతికి మేలు



మధ్య తరగతి ఆదాయ వర్గాల వారికి సానుకూలంగా ఉంది. ఒకప్పుడు రూ.3 లక్షల నుంచీ ఆదాయ పన్ను ఉండేది. ఇప్పుడు ఆదాయ పన్నులో కొన్ని దశలను ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. వ్యాపారవేత్తలకు ఉడాన్ సర్టిఫికెట్ ద్వారా రూ. 1 వడ్డీతో రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించి అభివృద్ధి చేసే ప్రణాళిక ఉంది.

- మోహనకుమారరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

రూ.12 లక్షల వరకూ పన్ను మినహాయింపు శుభ పరిణామం



సామాన్య ప్రజలకు మేలుచేసే విధంగా ఈ బడ్జెట్ ఉంది. సామాన్య ప్రజల కొనుగోలు శక్తి పెరగడానికి ఈ నిర్ణయం దోహద పడుతుంది. దేశంలోని మెజారిటీ ప్రజలకు పన్ను మినహాయింపు ఇవ్వడం గొప్ప నిర్ణయం. ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు కూడా ఈ నిర్ణయం మంచి ప్రయోజనాన్ని కల్గిస్తుంది. ఎక్కువ కుటుంబాలకు పన్ను మినహాయింపు కొత్త ఆదాయ పన్ను శ్లాబులు రూపొందించడం బాగుంది.

- డాక్టర్ కె.సునీత, ఎకనమెట్రిక్స్ విభాగం, ఎస్వీయూ

ఉద్యోగులకు ఊరట



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు కొంత మేర ఊరట లభించింది. గతంలో రూ.7లక్షల వరకు పన్నుభారం లేకుండా ఉండేది. ఈ బడ్జెట్‌లో రూ.12లక్షల వరకు పెంచడం శుభపరిణామం, గతంలో పోల్చుకుంటే చిరుద్యోగులకు లాభం చేకూరే విధంగా కనిపిస్తోంది.

- సురేష్‌బాబు, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు, తిరుపతి

అభివృద్దే లక్ష్యంగా..



పేదలు,రైతులు, మహిళలు, యువకుల అభివృద్ధే లక్ష్యంగా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉంది. 2047నాటికి ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారయ్యే బడ్జెట్ ఇది. రాష్ట్రానికి పోలవరం, రాజధాని, రైల్వేలు, జాతీయ రహదారులు, విశాఖ స్టీల్‌ప్లాంట్, విమానాశ్రయాల పునరుద్ధరణ వంటి వాటికి ఆశాజనకమైన కేటాయింపులు ఇచ్చారు.

- కోలా ఆనంద్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి

వేతన జీవులకు ఊరట

వేతనం మీద ఆధారపడే ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కేంద్ర బడ్జెట్ ఊరటనే చెప్పాలి. ఆదాయ పన్ను స్లాబు రేట్లు పెంచి పరిమితిని రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడం హర్షణీయం. ఒక నెల నుంచి రెండు నెలల జీతాన్ని ఆదాయ పన్ను రూపంలో చెల్లిస్తున్న ఉద్యోగులకు ఇది తీపి వార్త. ఒకేసారి ఐదు లక్షల రూపాయల మేరకు ఆదాయ పన్ను పరిమితి పెంచడం దేశ బడ్జెట్ చరిత్రలో ఇదే మొదటిసారి.



- శవన్నగారి బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

తిరుపతిలో వేడెక్కిన రాజకీయం

- డిప్యూటీ మేయర్ ఎన్నికతో అనూహ్య పరిణామాలు
- వైసీపీ కార్పొరేటర్ల క్యాంపులు, కూటమి నేతల చర్చలు
- అక్రమ నిర్మాణాలపై కార్పొరేషన్ కొరడా
- కూటమి చెంతకు శేఖర్ రెడ్డి
- నేడు టీడీపీ కండువా కప్పుకునే అవకాశం
- వైసీపీ నుంచి కొత్త అభ్యర్థిని ప్రకటించిన భూమన



ఎక్సకావేటర్‌తో భవనం కూల్చివేస్తున్న దృశ్యం


తిరుపతి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో శనివారం తిరుపతి పొలిటికల్ హైడ్రామాకు వేదికైంది. వైసీపీ నుంచి డిప్యూటీ మేయర్‌గా 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్ రెడ్డిని రెండు రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో 20 మంది కార్పొరేటర్లతో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. శేఖర్ రెడ్డి నేతృత్వంలో క్యాంపు రాజకీయాల్లో ఆరితేరిన వారిని రంగంలోకి దింపి తమిళనాడు రిసార్ట్‌లో రెస్ట్ తీసుకుంటున్నారు. ఇంతలో ఊహించని పరిణామాలు తిరుపతిలో చోటు చేసుకున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతికి చేరుకుని డిప్యూటీ మేయర్ ఎన్నికపై కూటమి నేతలలో చర్చిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి నగర పాలకసంస్థ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించడంతో రాజకీయ రగడ మొదలైంది. ముఖ్యంగా శేఖర్ రెడ్డి ఆస్తులపై ఫోకస్ పెట్టడంతో వైసీపీ శ్రేణులు కూల్చివేతను అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఇంతలో శేఖర్ రెడ్డి టీడీపీలో చేరేందుకు సిద్ధపడ్డారు. టీడీపీ సీనియర్ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి సమక్షంలో కూటమి పెద్దలతో మంతనాలు జరిగినట్టు తెలిసింది. ఆదివారం ఆయన టీడీపీలో చేరబోతున్నట్టు తెలుస్తోంది. కాగా, శనివారం సాయంత్రం వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కూటమి నాయకుల చర్యలను తప్పుబట్టారు. మరో వైసీపీ కార్పొరేటర్ లడ్డూ భాస్కరరెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు. తమ హయాంలో ఇలాంటి కుట్రపూరిత పనులు చేయలేదని చెప్పుకొచ్చారు. అయితే గత మున్సిపల్ ఎన్నికల సమయంలో టీడీపీకి చెందిన ఆర్సీ శ్రీనివాసులు తన భార్య కార్పొరేటర్‌గా పోటీ చేస్తుందన్న కారణంగా అతని జీవనాధారమైన టీషాపును తొలిగించిన ఘటనను పలువురు ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నారు. ఇదిలా వుండగా కూటమి పార్టీ నుంచి అభ్యర్థిపై కసరత్తు జరుగుతోంది. టీడీపీ నుంచి గెలిచిన ఒకే ఒక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, అసమ్మతి కార్పొరేటర్లను కూటమి వైపునకు తీసుకొచ్చేందుకు కృషిచేసిన నరసింహాచారి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఈనెల 3న జరగబోయే డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఇంకెన్ని విచిత్రమైన పరిణాలు చోటుచేసుకుంటాయో చూడాల్సి ఉంది.



అభినయ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

పుస్తకాల పండుగ ప్రారంభం

- 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీకృష్ణ



పుస్తకాలను తిలకిస్తున్న జస్టిస్ శ్రీకృష్ణ, ఆర్వీ కుమార్, సత్యనారాయణరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పుస్తకాల పండుగ ప్రారంభమైంది. పది రోజుల పాటు సాగే 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనను సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్రీకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ పుస్తక విజ్ఞానంలో భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు ఉన్నాయన్నారు. ఈ వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలని కోరారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ పుస్తకాలు మనుషులను మంచి ఆలోచనలు, మంచి మార్గం, మంచి లక్ష్యం వైపు నడిపిస్తాయన్నారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి సుకృతానంద మాట్లాడుతూ పుస్తక అధ్యయనం ద్వారా సామాన్యులు అసామాన్య స్థాయికి ఎదిగారన్నారు. పుస్తక ప్రదర్శన నిర్వాహకులు, భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ పుస్తకం మనిషి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నారు. అంతకుముందు వారు పుస్తక ప్రదర్శనను తిలకించారు. పుస్తక ప్రదర్శన వేదికపై పాడిన అన్నమయ్య కీర్తనలు ఆహూతులను అలరించాయి.

2,52,234మందికి పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. తొలిరోజు 2,63,191మందికి గాను 2,53,217 మందికి రూ.107.13కోట్లు పంపిణీ చేశారు. జిల్లాకు మూడవ స్థానం దక్కింది. మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న మంత్రులు, కలెక్టర్

బైరాగిపట్టెడలో తొక్కిసలాట ఘటనపై ప్రారంభమైన న్యాయ విచారణ

- బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సత్యనారాయణమూర్తి
- ఘటనా స్థలం పరిశీలించి వివరాలు తెలుసుకున్న కమిషన్



పద్మావతీ పార్కు వద్ద తొక్కిసలాట వివరాలను తెలుసుకుంటున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి

తిరుపతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గత నెల 8వ తేదీన వైకుంఠ ద్వారదర్శన టోకెన్ల జారీ కేంద్రం వద్ద తొక్కిసలాట జరిగి 40 మందికి పైగా భక్తులు గాయపడి, ఆరుగురు భక్తులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు న్యాయ విచారణ ప్రారంభమైంది. విచారణ కమిషన్‌గా నియమితులైన ఏపీ హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు.వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకు న్నారు. న్యాయ విచారణ కమిషన్ జస్టిస్ సత్యనారాయణ మూర్తి శుక్రవారం రాత్రి తిరుపతి చేరుకున్నారు. పద్మావతీ అతిథి గృహంలో బస చేసిన ఆయన శనివారం ఉదయం తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరుపతి కలెక్టరేట్ చేరుకున్నారు. కలెక్టరేట్‌లోని నాలుగో అంతస్తులో 413వ నంబరు గదిని విచారణ కమిషన్ కార్యాలయం కోసం ప్రభుత్వం కేటాయించింది. అక్కడికి చేరుకున్న సత్యనారాయణమూర్తి తొలుత బాధ్యతలు స్వీకరించారు.అనంతరం తొక్కిసలాట ఘటనపై ఇప్పటికే వివిధ విభాగాల నుంచీ ప్రభుత్వానికి అందిన నివేదికలతో కూడిన సమాచారాన్ని ప్రాథమికంగా పరిశీలించారు. ఆపై విచారణకు పిలవాల్సిన అధికారులు, ఉద్యోగులు, ఇతర వ్యక్తులకు సమన్లు, నోటీసులు సిద్ధం చేయించారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌లోని కార్యాలయం నుంచీ బయల్దేరి తొక్కిసలాట ఘటన జరిగిన బైరాగిపట్టెడ పద్మావతీ పార్కు వద్దకు చేరుకున్నారు.

అధికారులకు దూరంగా... : శుక్రవారం రాత్రి తిరుపతి వచ్చిన జస్టిస్ సత్య నారాయణమూర్తి అధికారులకు దూరంగా ఉన్నారు. శుక్రవారం రాత్రి పద్మావతీ అతిథి గృహం వద్ద కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు ఆయనకు స్వాగతం పలికారు. అది మినహా మరెక్కడా మరే ఇతర అధికారులూ ఆయనను కలిసే ప్రయత్నం చేయలేదు. తనకు కేటాయించిన సిబ్బందితోనే అవసరమైన సమాచారం విశ్లేషించడం, సమన్లు, నోటీసులు తయారు చేయడం చేశారు. అంతేకాకుండా ఘటనా స్థలాన్ని సందర్శించి నపుడు కూడా ఆయన వెంట కార్యాలయ సిబ్బంది మినహా పోలీసు, రెవిన్యూ, టీటీడీ, టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగాలకు చెందిన అధికారులు ఎవరూ లేకపోవడం గమనార్హం.

తొక్కిసలాట ఘటన వివరాల సేకరణ

పద్మావతీ పార్కు చేరుకున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి తొలుత తొక్కిసలాట జరిగిన ప్రధాన గేటును, పక్కనే వున్న చిన్న గేటును పరిశీలించారు. పార్కులోకి భక్తుల రాకపోకలకు వీలు కల్పించే గేట్లు ఇవేనా? పెద్దగేటును, చిన్న గేటును ఏయే సందర్భాల్లో వినియోగిస్తారు? అని సిబ్బందిని ప్రశ్నించారు. తిరుపతి అర్బన్ మండల సర్వేయర్ జగదీష్‌తో రెండు గేట్లు ఎంత వెడల్పు వున్నదీ కొలతలు తీయించారు. గత నెల 8వ తేదీన భక్తులు పార్కులోకి ఏ గేటు ద్వారా వెళ్లారు? వెలుపలికి ఏ గేటు ద్వారా వచ్చారు? అలాగే పార్కు నుంచీ టోకెన్లు జారీ చేసే కౌంటర్లకు ఎలా వెళ్లారు? అని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పార్కు మెయిన్ గేటు నుంచీ పక్కనే వున్న రామానాయుడు మున్సిపల్ హైస్కూలు వరకు బ్యారికేడ్ల ఏర్పాటు ఎలా జరిగిందన్న దానిపై వివరాలు సేకరించారు. పార్కు నుంచీ స్కూలు వరకూ ఐదు అడుగుల వెడల్పుతో రెండు క్యూ లైన్లు, స్కూలు వద్ద నుంచీ కౌంటర్ల వరకూ మాత్రం ఐదు అడుగుల వెడల్పుతో ఒకే క్యూ లైన్ ఏర్పాటు చేసిన సంగతి నమోదు చేసుకున్నారు.కౌంటర్లకు ఒకే క్యూ లైన్ ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. అయితే తొక్కిసలాట జరిగింది స్కూల్లో కాదని, పార్కు మెయిన్ గేటు వద్ద అని సిబ్బంది తెలియజేశారు. అనంతరం ఆయన రామానాయుడు స్కూలు మైదానంలోకి వెళ్లారు. టోకెన్లు తీసుకున్న భక్తులు స్కూలు ఆవరణ నుంచీ వెలుపలికి వెళ్ళే మార్గం గురించి ఆరా తీశారు. పార్కు మెయిన్ గేటు నుంచీ స్కూలు వరకూ ఏర్పాటు చేసిన క్యూలైన్ల కొలతలు, అలాగే స్కూల్లో మైదానం పొడవు, వెడల్పుతో కూడిన స్కెచ్‌లు సిద్ధం చేసి తనకు వెంటనే అందజేయాలని అధికారులను సత్యనారాయణమూర్తి ఆదేశించారు.

అధికారుల్లో గుబులు...

తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ ప్రారంభం కావడంతో కీలక బాధ్యతలు నిర్వర్తించిన అధికారులు, ఘటన జరిగిన రోజు సంబంధిత ప్రదేశంలో విధుల్లో వున్న అధికారులు, ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. ఘటన జరిగిన మరుసటి రోజున ప్రాథమిక సమాచారంతోనే బైరాగిపట్టెడ కేంద్రం వద్ద విధుల్లో వున్న డీఎస్పీ రమణ కుమార్, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి సస్పెన్షన్‌కు సీఎం చంద్రబాబు ఆదేశించిన సంగతి తెలిసిందే. ప్రత్యక్షంగా అక్కడ విధుల్లో లేకపోయినా మొత్తంమీద పర్యవేక్షణా బాధ్యత కలిగిన ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, టీటీడీ సీవోఎస్వో శ్రీధర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న అభిప్రాయం తో వారిని బదిలీ చేశారు. సీఎం చంద్రబాబు తిరుపతి వచ్చి వెళ్ళాక సీనియర్ ఐపీఎస్ అధికారులతో విచారణ చేయించి ఘటనకు కారణాలు, అధికారుల వైఫల్యాలపై సమగ్ర నివేదిక తెప్పించుకున్నారు. అయినా సంతృప్తి చెందని ముఖ్యమంత్రి న్యాయ విచారణకు ఆదేశించారు.విచారణ మొదలు కావడం, కమిషన్ అధికారులను దూరంగా పెట్టడంతో తొక్కిసలాట ఘటన జరిగిన రోజున విధుల్లో వున్న అధికారులు, ఉద్యోగుల్లో కలవరపాటు మొదలవుతోంది. మొత్తంగా పర్యవేక్షణ బాధ్యత కలిగినపై స్థాయి అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించామన్న ఆరోపణలను ఎదుర్కొనాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాని



చంద్రగిరి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎం.కొంగరవారిపల్లెలో శనివారం ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. పింఛనుదారులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలను, సమస్యలు తెలిసినందునే సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి నెల 1వ తేదీన క్రమం తప్పకుండా పెన్షన్ పంపిణీకి చర్యలు తీసుకున్నారన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, నాయకులు బాలకృష్ణమూర్తి, దొమ్మలపాటి సతీష్, కనుమూరి కేసీ నాయుడు, గాలి సతీష్, అనిల్‌చౌదరి, వెంకటముని పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



కావమ్మ గుడి వీధిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన పోలీసులు

చంద్రగిరి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని సీఐ సుబ్బరామిరెడ్డి హెచ్చరించారు. శనివారం రెవెన్యూ అధికారులు, ఎంపీడీవో, పంచాయతీ అధికారులతో కలిసి ఓపెన్ బూజింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. చంద్రగిరిలోని కావమ్మ గుడి వీధి సమీపంలో, మార్కెట్ యార్డ్ వద్ద పరిసరాల్లో మద్యం బాటిళ్ళు, చెత్తను శుభ్రం చేశారు. ఈసందర్భంగా సీఐ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ మండలంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, పంచాయతీ ఈవో మహేశ్వరయ్య పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామిని విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాల్లో ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్సై సంజీవరాయుడు

పాకాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్సై సంజీవరాయుడు హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోలకు సంబంధించి తగిన రికార్డులు ఉండాలని, యూనిఫాం ధరించాలని, పరిమితి మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల కాలనీల్లో కార్డెన్ సెర్చ్

● పోలీసుల అదుపులో 28 మంది అనుమానితులు



తిరుమల, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్, ఆర్బీ సెంటర్‌లో శనివారం వేకువజామున కార్డెన్ సెర్చ్ జరిగింది. రథసప్తమి జరుగనున్న నేపథ్యంలో డీఎస్పీ విజయ్‌శేఖర్ ఆధ్వర్యంలో 35 మంది పోలీసులు, 22 మంది విజిలెన్స్, 9 మంది రెవెన్యూ, ఎక్సైజ్, ఫారెస్ట్ విభాగాల నుంచి 12 మంది ఇందులో పాల్గొన్నారు. 699 ఇళ్లను తనిఖీ చేశారు. ఎలాంటి గుర్తింపులేని 28 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. పత్రాలు లేని 18 ద్విచక్రవాహనాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేస్తున్న వారిని గుర్తించిన రెవెన్యూ సిబ్బంది వివరాలను నమోదు చేసుకున్నారు.

స్టైఫండ్ పెంపునకు వెటర్నరీ విద్యార్థుల నిరసన



తిరుపతి రూరల్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): వెటర్నరీ వర్సిటీ పరిధిలోని విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని ఏపీ వెటర్నరీ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలోని వెటర్నరీ సైన్స్ కాలేజి విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. తరగతులను బహిష్కరించి వర్సిటీ పరిపాలనాభవనం వరకు ర్యాలీగా వెళ్లారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య, సీవోఈ ప్రొఫెసర్ చెంగల్వరాయులు, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. పరిపాలనాభవనం ఎదుట బైఠాయించారు. విద్యార్థులు మాట్లాడుతూ.. మెడిసిన్ కోర్సుల తరహాలో స్టైఫండ్ ఇవ్వాలని కోరారు. బీవీఎస్సీ విద్యార్థులకు 12ఏళ్లుగా రూ.7వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపైనే చర్యలు : కార్పొరేషన్ అధికారులు

తిరుపతి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ అధికారులు శనివారం 13 అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించారు. ప్రభుత్వ, టీటీడీ స్థలాల్లో నిర్మాణాల్లో కొన్ని పాక్షికంగా, మరికొన్ని పూర్తిగా తొలగించారు. నోటీసులిచ్చి చట్టప్రకారమే చర్యలు తీసుకున్నట్టు కార్పొరేషన్ అధికారులు మీడియాకు స్పష్టం చేశారు. డీబీఆర్ ఆస్పత్రి సమీపంలో భవనమైతే దేవదాయశాఖ (టీటీడీ)కి చెందిన స్థలమని రికార్డులను అందించారు. గతంలోనే వీటిని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. కాగా ఆ భవనం కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిదని చెబుతుండగా, ఇందుకు ఎలాంటి ఆధారంలేదని అధికారులు పేర్కొన్నారు. కరెంటు బిల్లులో వసుంధర కనస్ట్రక్షన్స్ పేరుఉందన్నారు. ప్లాన్, డాక్యుమెంట్ లేదన్నారు. ఇక్కడ బ్లాక్ మనీ మాఫియా నడుస్తోందన్న అనుమానాలను అధికారులు వ్యక్తం చేశారు. ప్రకాశం పార్కు దగ్గర ్ నిర్మాణం కూడా పూర్తిగా ప్రభుత్వ స్థలమేనంటూ ఆధారాలను మీడియాకు చూపించారు. ఆన్‌లైన్‌లో అది ప్రభుత్వ రిజర్వ్ స్థలంగా ఉందన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసినట్టుగానే స్పష్టమవుతోందన్నారు. సాయికృష్ణ లేఅవుట్, జనచైతన్య లేఅవుట్ దగ్గర 8 అక్రమ నిర్మాణాలను తీసివేసినట్టుగా చెబుతున్నారు. ఎక్కడా రాజకీయ కక్షలేదని, అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టినందునే చర్యలు తీసుకున్నామని పేర్కొంటున్నారు.

త్వరితగతిన సుందరీకరణ పనులు : కమిషనర్ మౌర్య

తిరుపతి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):డివైడర్లు, కూడళ్లలో సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం సుబ్బలక్ష్మి కూడలి, రామానుజ కూడలి, లీలామహల్ కూడళ్లలో సుందరీకరణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మౌర్య మాట్లాడుతూ కూడళ్లు, డివైడర్లలో పూల మొక్కలు నాటాలన్నారు. గొల్లవానిగుంట వద్ద స్టేడియాన్ని పరిశీలించారు. రాయలచెరువు రోడ్డులో నిర్మిస్తున్న తుడా టవర్స్ పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. అనంతరం తుడా సమీక్ష నిర్వహించారు. సెక్రటరీ వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, అడ్వైజర్ రామకృష్ణ రావు, డీఈబాషా, షణ్ముగం, సుశీల్ కుమార్‌లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి : ట్రాఫిక్ సీఐ సంజీవ్ కుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరూ పక్కాగా పాటించాలని ట్రాఫిక్ సీఐ సంజీవ్ కుమార్ కోరారు. సెట్విన్, ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, ప్రిన్సిపాల్ సుధారాణి, డీన్ మురళీధర్, డాక్టర్ వివేక్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం ఎదుట జస్టిస్ జ్యోతిర్మయి

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుచానూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏఈవో దేవరాజులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.

11న స్థానికులకు దర్శనం

తిరుమల, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): స్థానికుల దర్శన కోటాలో అధికారులు మార్పు చేశారు. మొదటి మంగళవారం రోజు రథసప్తమి కారణంగా రెండవ మంగళవారం (11వ తేదీ) స్థానికులకు దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. తిరుమలలోని స్థానికులకు బాలాజీనగర్ కమ్యూనిటీహాల్‌లో, తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో 9వ తేదీ ఆదివారం టోకెన్లు జారీ చేయనున్నారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బ్యూటీషియన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుచానూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా ప్రాంగణంలో బ్యూటీషియన్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజరు డాక్టర్ పర్హాన తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కోర్సు రెండు నెలల కాల వ్యవధి కోర్సు చేరేందుకు 10వ తరగతి వరకు చదివి 18-45 లోపు మహిళలు ఆరేషన్‌కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత నకలు, మూడు ఫోటోలతో కార్యాలయంలో నేరుగా సంప్రదించాలన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.

అస్వస్థతకు గురైన వ్యక్తి మృతి

తిరుమల, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తీవ్ర అస్వస్థతకు గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సుమారు 37 ఏళ్ల వయసున్న రమణకుమార్ ఆనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం అశ్విని ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అతను చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పేరు, ఊరు తప్పా మరే వివరాలు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు వివరాలు తెలిసిన వారు తిరుమల టూటౌన్ పోలీసులకు 94407 96772 నంబరుకు తెలియజేయాలని సీఐ శ్రీరాముడు ఓ ప్రకటనలో కోరారు.

రోడ్డుప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం



మృతి చెందిన రవి

చంద్రగిరి, ఫిబ్రవరి 1: తొండవాడ వద్ద ఆటోను గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొన్నప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు తిరుపతి గుంతగాదంకి చెందిన డి.రవి(45) శనివారం రాత్రి ఆటో నడుపుకొంటూ జాతీయరహదారి సర్వీసు రోడ్డులో వెళ్తున్నాడు. తొండవాడ వద్ద గుర్తు తెలియని కారు ఎదురుగా వచ్చి ఢీ కొంది. దీంతో ఆటో అద్దం పగలి అతని గొంతుకు మెడ కోసుకుపోయింది. తీవ్ర రక్తస్రావం జరిగి రవి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తులకు ప్రాధాన్యం

● అందరికీ ఉచిత లడ్డూ ప్రసాదం
● మహిళలకు పసుపు కుంకుమ
● మహాశివరాత్రి వేడుకలపై మంత్రుల సమీక్ష



మాట్లాడుతున్న మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులను సంతృప్తికర దర్శనం కల్పించడమే లక్ష్యమని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై శనివారం శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ వివరాలను మంత్రులు మీడియాకు వెల్లడించారు. ఈ నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ తావులేకుండా నిర్వహిస్తామన్నారు. ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం ఉత్సవాల్లో భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించామని తెలిపారు. మహిళలకు జ్ఞానప్రసూనాంబిక అనుగ్రహ ప్రసాదంగా రవిక, గాజులు, పసుపు, కుంకుమను సారెగా ఇవ్వనున్నట్లు చెప్పారు. వీవీఐపీ, వీఐపీల కోసం ప్రత్యేక టైంస్లాట్ కేటాయించామన్నారు. పిల్లలు తప్పిపోతే సులభంగా గుర్తించేలా జియో ట్యాగింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వామి అమ్మవార్ల కల్యాణం రోజున పట్టువస్త్రాలు సమర్పించేందుకు సీఎం చంద్రబాబును ఆహ్వానించామన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు బైపాస్ రోడ్డు నుంచి తాత్కాలిక రోడ్డు నిర్మించేందుకు అనుమతించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి, నాయకులు టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

స్థానికులకు ఉచిత దర్శనం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానికులకు శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనాన్ని ఉచితంగా కల్పిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శివరాత్రి మరుసటి రోజున స్థానికుల కోసం ప్రత్యేకంగా ఉచిత క్యూలైన్ విధానం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి 24 మంది సభ్యులతో సేవా సమితిని ఏర్పాటు చేస్తామన్నారు.

పరకామణిలో భద్రతపై టీటీడీ చైర్మన్ ఆరా



లడ్డూ పోటు సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): పరకామణిలో భద్రతాఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అధికారులను ఆదేశించారు. తిరుమలలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయన పరకామణి, లడ్డూల బూందీ తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేశారు. హుండీ లెక్కింపుపై సిబ్బందితో మాట్లాడారు. సీసీ కెమెరాల నిఘాపై సూచనలు చేశారు. తర్వాత లడ్డూ బూందీ తయారీ కేంద్రానికి చేరుకుని తయారీ, నెయ్యి టిన్లు, పిండి మిక్సింగ్, కన్వేయర్ బెల్ట్ ద్వారా ముడి పదార్థాలను ఆలయంలోకి తరలించే విధానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా పోటు సిబ్బందితో మాట్లాడుతూ పోటులో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తతో ఉండాలన్నారు. భక్తులతో మాట్లాడిన ఆయన లడ్డూల బరువు తూకం పరిశీలించారు. ఈసందర్భంలోనే పలువురు భక్తులు లడ్డూల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. లడ్డూపోటును కూడా చైర్మన్ పరిశీలించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి శనివారం ఉదయం మాడవీధుల్లోని రథసప్తమి ఏర్పాట్లను పరిశీలించారు.

ఘనంగా రాజశ్యామల హోమం



రామచంద్రాపురరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శక్తిపీఠంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాజశ్యామల హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఊంజల్‌సేవ మేళతాళాల నడుమ జరిగింది. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధిశ్వరి రమ్యానంద భారతి పాల్గొన్నారు.

వేద వర్సిటీలో చిరుత..!

● ఏడీ బిల్డింగ్ సమీపంలో కుక్కను చంపిన వైనం



కుక్కను చంపి తింటున్న చిరుత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర వేద యూనివర్సిటీలో చిరుత జాడ కన్పించింది. శుక్రవారం రాత్రి రామేశ్వరం భవన్ (ఏడీ బిల్డింగ్) ముందున్న ఓ కుక్కను చంపి తింటున్న చిరుతను ప్రత్యక్షంగా అక్కడి వారు చూశారు. ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో చిత్రించారు. చిరుత సంచారం నేపథ్యంతో వేద వర్సిటీ విద్యార్థులను, ఉద్యోగులను అధికారులు అప్రమత్తం చేశారు. అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప రాత్రి వేళల్లో బయటికి రావొద్దని కోరారు. అయితే చిరుత సంచారం వేద వర్సిటీ, ఎస్వీయూ పరిసరాల్లో హడలెత్తిస్తూ ఉంది. చిరుతను బంధించి భయాందోళన తొలగించాలని యూనివర్సిటీ విద్యార్థులు కోరుతున్నారు.

రైతు వేదన పట్టని అధికారులు

● బోరుకు సరఫరా కాని విద్యుత్



పాకాల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బోరులో నీళ్లు పుష్కలంగా ఉన్నా విద్యుత్ సరఫరాలేక మూడునెలలుగా పంట సాగుచేయలేక ఓ రైతు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సూరినేనివారిపల్లెకు చెందిన ఎస్.భాస్కర్‌నాయుడుకు గ్రామ సమీపంలో వ్యవసాయ భూమి వుంది. బోరు, మోటారుతో వ్యవసాయం చేస్తున్నాడు. 3నెలల క్రితం బోరు మోటారుకు చెందిన పోల్ కేబుల్ వైరు కాలిపోయింది. మరమ్మతు చేయాలని పలుసార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నానని రైతు వాపోతున్నాడు.

పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యం

తిరుపతి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబాన్నీ ఆర్థికంగా అభివృద్ధి చేసి పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. తుడా కార్యాలయంలో కమిషనర్ అధ్యక్షతన సిటీ లెవెల్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), దీనదయాళ్ జాతీయ పట్టణ జీవనోపాధుల సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జీవనోపాధుల కల్పనకు సంబంధించిన అన్నిశాఖలు, పరిశ్రమలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘ సభ్యులతో సిటీ లైవ్‌లీవుడ్ టాస్క్‌ఫోర్స్ (సీఎల్‌టీఫ్) కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో రాబోయే ఐదేళ్లకు పట్టణంలోని నిస్సహాయులు, పేదలందరికీ సుస్థిర జీవనోపాధులు కల్పించే అవకాశాలపై ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి.రవీంద్ర, ఎంఎస్ఎంఈ నుండి రాజేంద్ర ప్రసాద్, సీఎంఎస్ కృష్ణవేణి, యస్.సోమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వైన్‌షాపుల యజమానుల వినతి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మద్యం అమ్మకాలపై ఎమ్మార్పీ మీద 20శాతం మార్జిన్ ఇస్తామని జీవో ఇచ్చిందని అయితే ప్రస్తుతం 9శాతం మేరే మార్జిన్ వస్తోంది. దీంతో భారీగా నష్టపోతున్నామని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మార్జిన్ పెంచేలా చూడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మద్యం షాపుల యజమానులు విన్నవించారు. శనివారం రాత్రి ఓ ప్రైవేటు హోటల్‌లో తిరుపతి అర్బన్, రూరల్ వైన్‌షాప్ సభ్యులు ఆయన్ను కలిసి విజ్ఞప్తిచేశారు. వైన్‌షాపుల అసోసియేషన్ నాయకులు తుమ్మల గుణశేఖర్‌నాయుడు, భరత్‌రెడ్డి, తిరుమలరెడ్డి, సుబ్రహ్మణ్యం, కమల్, జేకే, శివ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన పాలిటెక్నిక్ విద్యార్థినులు


తిరుపతి(విద్య), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. బంగారు పతకాలు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.ద్వారకానాథ్‌రెడ్డి మాట్లాడుతూ 400 మీటర్ల పరుగు పందెంలో బిందుశ్రీ, మౌనిక, హసీనాబీ, భవ్య బంగారు పతకాలు సాధించారని వెల్లడించారు. జి. చరణ్‌రెడ్డి టేబుల్ టెన్నిస్‌లో రన్నరప్‌గా నిలిచాడని తెలిపారు. బిందుశ్రీ 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించిందని వివరించారు. ప్రతిభ కనబరిచిన మరికొంతమంది సౌత్‌జోన్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు.

నకిలీ మద్యం కేసు సూత్రధారి పట్టివేత

●మరో నలుగురు అరెస్ట్
●రూ.30 లక్షల ముడి పదార్థాల స్వాధీనం
●వైసీసీ నాయకుల సహకారంతోనే వ్యవహారం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో కీలక సూత్రధారి రావూరి వెంకటరమణతో పాటు నలుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. రైల్వేకోడూరులో శుక్రవారం బహిర్గతమైన ఈ కేసులో ఇద్దరిని ఇప్పటికే అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారి,ప్రధాన నిందితుడు వెంకటరమణను శనివారం తిరుపతిలో జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏఈఎస్ వాసుదేవ చౌదరి, సీఐలు, సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. కొంతమంది వైసీపీ నాయకులు తెరవెనుక ఉంటూ నకిలీ మద్యం వ్యాపారం నడిపించినట్లు విచారణలో తేలింది. కడప, తిరుపతికి చెందిన ఇద్దరు కింది స్థాయి నాయకుల హస్తముందని గుర్తించారు. ప్రధాన నిందితుడు తిరుపతి కేంద్రంగా చేసుకుని విచ్చలవిడిగా నకిలీ మద్యం తయారు చేసి రూ.కోట్లు గడించాడు. ఇతనికి వరుసకు సోదరుడయ్యే సుబ్బయ్య (మచిలీపట్నం) సహకరించేవాడు. సుబ్బయ్యతో పాటు కేసుతో సంబంధమున్న చికెన్ శీను, మహేష్, ఓ స్టూడియో యజమాని శివశంకర్‌నాయుడులను అరెస్టు చేశారు. రైల్వేకోడూరు మండలం చిన్నచోడవరం వద్ద స్టూడియోలో నకిలీ బాండ్ల లేబుళ్ళను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అక్కడకు వెళ్లి కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు, 34వేల లేబుళ్ళను స్వాధీనం చేసుకున్నారు. రాజంపేటలో 50 క్యాన్ల స్పిరిట్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. దామినేడులో చికెన్ శీను సోదరి ఇంటిలో నిందితులు ఉంచిన రూ.30 లక్షల విలువ చేసే ముడి పదార్థాలను సీజ్ చేశారు. ఈ కేసులో ఇంటి యజమానిని కూడా విచారించినట్లు తెలిసింది.





ఇస్కాన్ ముందున్న వినాయకనగర్ మైదానంలో బుక్ ఎగ్జిబిషన్ సందడి మొదలైంది. భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో టీటీడీ సహకారంతో శనివారం ఈ పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. సుమారు 70 ప్రచురణ, విక్రయ సంస్థలు తమ పుస్తకాలను ఇందులో ఉంచాయి. రోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ పుస్తక ప్రదర్శన ఉంటుంది. ఆదివారం మాత్రం ఒక గంట ముందుగానే అంటే మధ్యాహ్నం 12 గంటలకే అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు విద్యార్థులు వచ్చి తమకు అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేశారు.

హథీరాంజీ మఠం భూముల్లో
దొంగలు పడ్డారు

వైసీపీ హయాంలో 300 ఎకరాల ఆక్రమణ - కిరణ్ రాయల్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం భూముల్లో దొంగలు పడ్డారని మొత్తం 300 ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యాయని తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. శ్రీవారి ప్రియభక్తుడు హథీరాంజీ 1100 ఎకరాల భూములను ఆలయానికి అప్పగిస్తే వాటిల్లో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఢిల్లీ నుంచి గల్లీ వరకు చోటా మోటా వైసీపీ నేతలందరూ కలిసి 300 ఎకరాల భూములను ఆక్రమించుకున్నారని తెలిపారు. ఒక్క తిరుపతి నగర పరిధిలోనే 150 ఎకరాలకు పైగా మాజీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. మఠం అధికారులు సైతం ఆక్రమణదారుల నుంచి అందిన కాడికి దోచుకొని వారికి భూములను కట్టబెట్టారన్నారు. మరికొందరు అధికారులు వైసీపీ ప్రధాన నేతపై ఆయన కుమారుడిపై ఉన్న కుల అభిమానంతో వారికి కావాల్సిన చోట అడిగినంత భూములను కట్టబెట్టడమే కాకుండా ఇప్పటికీ వైసీపీ నేతల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారన్నారు. ఇలా కుల అభిమానంతో పనిచేయాలంటే ఇళ్లకు పోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.మఠం భూముల రక్షణకు ఒక ఫిట్ పర్సన్ను నియమిస్తే ఆయన ఫిట్ లేని పర్సన్‌గా ఉన్నాడని ఎద్దేవా చేశారు. అధికారులు ఆక్రమణకు గురైన భూములను రక్షించి ప్రభుత్వానికి అప్పగించాలన్నారు. ఆక్రమణకు గురైన మఠం భూములు, దానికి సహకరించిన అధికారుల తీరుపై సమగ్ర విచారణ చేపట్టేలా నివేదిక సిద్ధం చేసి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రుల దృష్టికి తీసుకువెళతామన్నారు. అనంతరం మఠం భూములను రక్షించాలంటూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకేపాటి సుభాషిణి, రుద్ర కిశోర్, మనోజ్, షరీఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



తిరుపతి (జీవకోన),ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): లీలామహల్ కూడలిలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్‌కు శనివారం మరమ్మతులు చేపట్టారు. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో శనివారం ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ శీర్షికతో వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు. వాహనదారులు, పాదచారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రథ సప్తమికి మూడంచెల భద్రత : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో 4వ తేదీ జరగనున్న రథసప్తమికి మూడంచెల భద్రత కల్పిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు వెల్లడించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా జరిగిన ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందడం...మరో 40 మంది దాకా గాయపడడం తెలిసిన విషయమే. దీన్ని దృష్టిలో ఉంచుకుని మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. మాడ వీధులతో పాటు అన్ని గ్యాలరీలు, భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే మార్గాలు, వెలుపలికి వచ్చే ప్రాంతాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నామని వివరించారు. ఎంత మంది భక్తులు వచ్చే అవకాశం ఉందో టీటీడీ ఇచ్చే నివేదిక ఆధారంగా విజిలెన్స్‌లో కలిసి చర్యలు చేపట్టడానికి టీటీడీ అధికారులతో సమన్వయం చేసుకుని రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం 1800 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.

చెరువుల సుందరీకరణకు 'డ్రోన్ సర్వే'



మంగళంలోని చెన్నాయగుంట చెరువులో ఏరియల్ డ్రోన్ సర్వే నిర్వహిస్తున్న నిపుణులు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్, రూరల్, రేణిగుంట మండలాల్లో ఉన్న మొత్తం 19 చెరువులను సుందరీకరించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. సీఎం చంద్రబాబు ఇటీవల తిరుపతి పర్యటనకు వచ్చినప్పుడు చెరువులను సుందరీకరణ చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో చర్యలు చేపట్టిన ఆయన ఏరియల్ డ్రోన్ ద్వారా చెరువులను సర్వే చేయడం కోసం హైదరాబాదుకు చెందిన 'ఇండియా డ్రోన్ అకాడమి' సంస్థను ఆహ్వానించారు. ఆ సంస్థకు చెందిన సాంకేతిక నిపుణులు(డ్రోన్ పైలెట్స్)వెంకటేష్, వంశీకృష్ణ, శ్రీకాంత్‌లు తగిన యంత్రాలు, మేట్రిస్ ఆర్టీకే 350డిగ్రీలు, ఏరియల్ డ్రోన్ 360డిగ్రీల డ్రోన్ కెమెరాలు, వీటికి అనుసంధానంగా పనిచేసే ఇతర సాంకేతిక పరికరాలతో శుక్రవారం ఉదయం తిరుపతికి చేరుకొన్నారు. మూడు మండలాల రెవెన్యూ విభాగం సహకారంతో వీరు పనిచేస్తున్నారు.

●తొలిరోజున శుక్రవారం రూరల్ పరిధిలోని దామినేడు, పేరూరు, రామక్క, నందిగుంట చెరువులను పూర్తి చేశారు.

●రెండో రోజున శనివారం అర్బన్ పరిధిలోని కొర్రమేనుగుంట, పూలవాణిగుంట, గొల్లవాణిగుంట, శెట్టిపల్లి, అన్నాచెరువు, చెన్నాయగుంట, మంగళం, పాన్‌చెరువుల సర్వే పూర్తిచేశారు.

●మూడో రోజు ఆదివారం రేణిగుంట పరిధిలోని తూకివాకం పెద్ద, చిన్న, వెంకటాపురం, అన్నాసాంపల్లి, తిమ్మగుంట, ఎర్రంరెడ్డిపాళెం, కొత్రమంగళం, ఎర్రగుంట చెరువులను డ్రోన్ సర్వే నిర్వహించనున్నారు. ఈ ఏరియల్ సర్వే ద్వారా తీసిన ఇమేజెస్, వీడియోల ఆధారంగా చెరువుల విస్తీర్ణం, ఏ పరిధిలో ఉన్నాయి. ప్రస్తుత స్థితిగతలు, నగరాలకు, రహదారులకు ఎంతదూరంలో ఉన్నాయో పరిశీలించనున్నారు. డిజటల్ సర్వే డేటాను కలెక్టర్‌కు నివేదించనున్నారు. ఆ తరువాత చెరువులను ఏ విధంగా సుందరీకరణ చేయవచ్చన్న అంశాలతో నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

డిప్యూటీ మేయర్ ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు

రేపు ఉదయం 11 గంటలకు ఎన్నిక

తిరుపతి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జరగనున్న ఈ ఎన్నికల ఏర్పాట్లపై శనివారం ఆయన సమీక్షించారు. పార్టీ ప్రతినిధులు విప్ ప్రతులను ఆదివారం ఉదయం తన చాంబర్‌లో అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు నిర్దేశిత సమయం కంటే ముందుగా సెనేట్ హాలుకు హాజరుకావాలని సూచించారు. సెల్‌ఫోన్లకు, బంధుమిత్రులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, అధికారులు పాల్గొన్నారు.

కూటమి చెంత 23 మంది: టచ్‌లో మరో ముగ్గురు

అనేక నాటకీయ పరిణామాల నేపథ్యంలో కూటమి చెంతకు 23 మంది కార్పొరేటర్లు చేరినట్టు తెలిసింది. వీరంతా సమీపంలోని ఓ రిసార్ట్‌లో ఉన్నట్టు సమాచారం. వైసీపీ క్యాంపులో ఉన్న ఓ ముగ్గురు కార్పొరేటర్లు వీరితో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఆదివారం సాయంత్రానికి లేదా సోమవారం ఎన్నిక సమయంలో వారు కూటమివైపు చేతులెత్తేందుకు సిద్ధమైనట్టు సమాచారం. మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నాయకులు ఎన్వీ ప్రసాద్, మబ్బు దేవనారాయణ రెడ్డి, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాధ్‌లు సమన్వయంతో అసమ్మతి కార్పొరేటర్లను ఏకంచేయడంలో సఫలీకృతులయ్యారని కూటమి వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఆర్సీ మునికృష్ణను అభ్యర్థిగా ఖరారు చేసినట్టు సమాచారం.

రేపు ఉచిత అక్షరాభ్యాసం

తిరుపతి, వైద్యం,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్.ఎస్.మాడవీధిలోని చిగోర అధ్యాత్మిక సేవా కేంద్రంలో ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించనున్న ఉచిత అభ్యరాభ్యాస కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని సేవా కేంద్రం నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు.అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఆదివారం సాయంత్రం లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9985532 447, 9440271154 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు స్విమ్స్‌లో డ్రైవరు పోస్టులకు ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లోని ఎంఆర్‌సీ రీసెర్చ్ ప్రాజెక్టులో కాంట్రాక్టు విధానంలో పనిచేసేందుకు రెండు డ్రైవర్ పోస్టులకు ఈ నెల 3న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్.బిట్ల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ కేటగిరిల కింద ఒక్కో పోస్టు ఉన్నాయని పేర్కొన్నారు. పాత డైరెక్టరు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని వివరించారు. వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె పేర్కొన్నారు.

వ్యక్తిగత కక్షలు మానుకోవాలి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షలకు పాల్పడటాన్ని కూటమి ప్రభుత్వం మానుకోకపోతే ప్రజలు బుద్ధి చెప్పే పరిస్థితి దగ్గర్లోనే ఉందని వైసీపీ నేత అరుణ్‌యాదవ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన వైసీపీ నాయకులతో కలిసి శనివారం మీడియాతో మాట్లాడారు. డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా వైసీపీ నుంచి శేఖర్‌రెడ్డి పేరును ప్రకటించిన వెంటనే కూటమి నేతలు ఆయన ఆస్తులను కూల్చేందుకు ప్రయత్నం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సురేష్, బాలు, దుర్గ, బాబు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని అక్కారంపల్లె లెక్కదాఖలా సర్వే నెంబరు 161, 162లో ఉన్న కాలువ పొరంబోకు భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను శనివారం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేశారు. అక్రమ కట్టడాలు నిర్మించారన్న ఫిర్యాదులు రావడంతో వాటిని తొలగించినట్లు అధికారులు తెలియజేశారు.

టీటీడీ సహకార పరపతి సంఘంలో జీఎం పోస్టుకు 10న ఇంటర్వ్యూ

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగుల సహకార పరపతి సంఘంలో జనరల్ మేనేజర్ పోస్టు భర్తీ కోసం (కాంట్రాక్ట్ విధానం) ఈ నెల 10వ తేదీనఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షులు కిషోర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఆపై కేడర్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సంస్థ కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7780795330, 9959670942 నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో రేణిగుంట- తిరుపతి మధ్య 132 కేవీ విద్యుత్‌తీగలుమార్చేందుకు ఆదివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖర్ రావు తెలిపారు. ఎస్‌టీవీ నగర్, న్యూ ఇందిరానగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

తిరుపతి రూరల్ డివిజన్ ఈఈగా చిన్న రెడ్డెప్ప



ఈఈగా చిన్న రెడ్డెప్ప బాధ్యతలు తీసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఈలు

తిరుపతి (ఆటోనగర్) ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం తిరుపతి రూరల్ డివిజన్ ఈఈగా ఎం.చిన్నరెడ్డెప్ప శనివారం బాధ్యతలు చేపట్టారు. డివిజన్ ఈఈగా వున్న ఎన్.వాసురెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ క్రమంలో కర్నూల్ సర్కిల్లో ఉన్న ఎం.చిన్న రెడ్డెప్పను ఇక్కడకు బదిలీ చేస్తూ సంస్థ సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక పాత తిరుచానూరు రోడ్డులోని డీఈ కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో వున్న డీఈఈలు జీవన్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, సుధాకర్, ఏఈలు రాజేష్, హరిప్రసాద్, వెంకటరమణ, నీలకంఠంలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రుయాలో సెక్యూరిటీ గార్డుపై దాడి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అంబులెన్సులకు అడ్డుగా ఉన్న వాహనాన్ని పక్కకు తీయమన్నందుకు సెక్యూరిటీ గార్డుపై టీడీపీకి చెందిన ఓ నాయకుడు పాల్పడ్డాడు. స్థానికంగా టీడీపీకి చెందిన లోకనాథం అనే వ్యక్తి హెచ్‌డీఎస్ సభ్యులు కరణం సందీప్‌ను కలిసేందుకు శనివారం రుయాస్పత్రికి వచ్చాడు. ఆ సమయంలో వాహనాన్ని పరిపాలనా భవనం ముందు రోడ్డుకు అడ్డంగా వాహనాన్ని ఆపబోయాడు. అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు కిరణ్ గుర్తించి 'సార్ ఇక్కడ వాహనం ఆపకూడదు పక్కన పెట్టుకోండి' అని చెబుతున్నా 'నువ్వెరు నాకు చెప్పేందుకు' అంటూ దురుసుగా మాట్లాడుతూ అక్కడే వాహనం ఉంచి లోనికి వెళ్లాడు. అదే సమయంలో చిన్నపిల్ల వార్డు నుంచి అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం అంబులెన్సు చిన్నారులను తీసుకువచ్చింది. దీంతో టీడీపీ నాయకుడి వాహనాన్ని సెక్యూరిటీ గార్డు పక్కకు జరిపే ప్రయత్నం చేశాడు. దీంతో 'నా వాహనాన్నే పక్కకు జరుపుతావా నేనెవరో తెలుసా' అంటూ వచ్చిన లోకనాథం సెక్యూరిటీ గార్డు కిరణ్‌పై దాడిచేశాడు. అక్కడే ఉన్న సిబ్బంది ఆయన్ను అడ్డుకున్నారు. సెక్యూరిటీ మేనేజరు శంకర్ అక్కడకు చేరుకొని జరిగిన విషయాన్ని అక్కడి అవుట్ పోస్టులోని పోలీసులకు, ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హెచ్‌డీఎస్ సభ్యులు కరణం సందీప్, షేక్ ఖాజా కలుగజేసుకొని సెక్యూరిటీ సిబ్బందితో చర్చలు జరిపారు. ఇంకోసారి ఇలా జరగకుండా చూస్తానంటూ రాజీ ప్రయత్నం చేశారు. అయినా సెక్యూరిటీ అధికారులు వినిపించుకోకపోవడంతో విషయాన్ని ఏఆర్ఎంవో హరికృష్ణ దృష్టికి తీసుకువెళ్లి ఆయన సమక్షంలో రాజీ చేయించారు.

కడివేటికి అబ్దుల్‌కలామ్ అవార్డు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పాటల మాంత్రికుడైన సంగీత కళాకారుడు డాక్టర్ కడివేటి మునిరత్నంకు తెలుగు కళారత్నాల సాంస్కృతిక సేవాసంస్థ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది. పలు సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన వివిధ పాటలు ఆలపిస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నందుకు ఆ సంస్థ గుర్తించింది. దీంతో ఈ నెల 9న హైదరాబాదులోని త్యాగరాజ గానసభ ప్రాంగణంలో ఆయన అవార్డును అందుకోనున్నారు. సందర్భంగా పలువురు ఆయన్ను అభినందించారు.

బడ్జెట్‌పై బీజేపీ సంబరాలు

తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక రాఘవేంద్ర నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ప్రజారంజకమైన బడ్జెట్‌ను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు భవానీశంకర్, వరప్రసాద్, అజయ్‌కుమార్, గవ్వల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహాకుంభమేళాకు ఆర్టీసీ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో మహాకుంభమేళాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసినట్లు డిప్యూటీ సీటీఎం పి.విశ్వనాథం శనివారం ప్రకటించారు. గత బుధవారం ఆంధ్రజ్యోతిలో 'మహాకుంభమేళాకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేయరా?' అన్న శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రధాన కార్యాలయం నుంచి అనుమతి తీసుకొని రోడ్ పర్మిట్లు పొందారు. ఈ మేరకు 7న, 14న బస్సులు కేటాయించగా ఆ రోజులలో రాత్రి 9గంటలకు తిరుపతి సెంట్రల్ బస్టాండు నుంచి బయల్దేరుతాయి. వివరాలకు 9959225684, 9959225685 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జనంతో జనసేన సభను విజయవంతం చేయండి: ఎమ్మెల్యే



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గం సోమలలోని జెడ్పీ హైస్కూల్ వద్ద ఆదివారం నిర్వహించే 'జనంతో జనసేన' బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన నివాసంలో బహిరంగ సభ విజయవంతంపై జనసైనికులతో సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ జనంతో జనసేన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు, మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు చిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, పార్టీ సీనియర్ నేత కిరణ్‌రాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

అవినీతి అధికారుల సమాచారం ఇవ్వండి : ఏఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో లంచాలు డిమాండ్ చేస్తున్న అవినీతి అధికారుల సమాచారం ఇవ్వాలని అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ విమలకుమారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సమాచారం ఇచ్చే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఏఎస్పీ పేర్కొన్నారు. అవినీతి అధికారుల వివరాలు ఇవ్వాలంటే తిరుపతి ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి నెంబరు 9440441630కు కానీ లేకుంటే డీఎస్పీ జస్సీ ప్రశాంతి 9440441690 కు కానీ ఫోన్ చేసి సమాచారం ఇవ్వచ్చని తెలియజేశారు.

కూటమి అరాచకాలు పెరిగిపోయాయి
భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కూటమి ప్రభుత్వ అరాచకాలు పెరిగిపోయాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేసిన శేఖర్‌రెడ్డి ఆస్తులను ధ్వంసం చేయడానికి పూనుకోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. శనివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలకు మెజార్టీ లేకపోవడంతో ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే దీనికి పదింతలు బదులు తీర్చుకుంటామని హెచ్చరించారు. శేఖర్‌రెడ్డి డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా విరమించుకుంటే తమ పార్టీ అభ్యర్థిగా లడ్డూ భాస్కర్‌ను పోటీలో నిలుపుతామన్నారు.

రుయాలో మానసిక రోగి అదృశ్యం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 1(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న మానసిక రోగి అదృశ్యంపై కుటుంబ సభ్యులు శనివారం వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు జిల్లా కలువాయి మండలం ఉయ్యాలపల్లికి చెందిన పెంచల నరసయ్య(27) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పెంచల నరసయ్యను చికిత్స నిమిత్తం గత నెల 27న రుయాలో చేర్పించారు. మరుసటి రోజు 28న అతడు మూత్ర విసర్జనకు అని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది రెండు రోజులుగా వెతికినా జాడలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కండక్టర్ నరసింహులుకు సన్మానం



తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన మొగరాల నరసింహులును శనివారం ఘనంగా సన్మానించారు. ఉదయం సీబీఎస్‌లో ఏర్పాటుచేసిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, పర్సనల్ ఆఫీసర్ సహజాద్ ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సహచర కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది గజమాల, శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. అధికారులు టీఎం.చంద్ర, పుష్పలత, సహ ఉద్యోగులు అర్జునయ్య, వేణు, ఈ.ఆర్.కుమార్, చంటి, విశ్రాంత ఉద్యోగి సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శనివారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పెరగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతిఒక్కరూ ఏదో ఒక క్రీడలో నైపుణ్యాన్ని చాటాలన్నారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, రాజేష్‌రెడ్డి, రాఘవయ్య, కొండారెడ్డి, సౌమ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హామీల అమలుకు కృషి: పాశం

గూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని 13వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పెంచడంతో పాటు ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటికి వద్దకు వెళ్లి అందజేయడం జరుగుతోందన్నారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీలను నేరవేర్చేందుకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అలాగే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా మంత్రి నారా లోకేశ్ వివిధ బహుళజాతి కంపెనీలను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు అబ్దుల్‌రహీం, జహంగీర్, ముర్తుజా, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ఓజిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం నెమళ్లపూడి, కరబల్లవోలు గ్రామాల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.21 కోట్లతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నాయకులు నెలవల రాజేష్, నిరంజన్, కనుమూరు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండలంలో 95.15 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కార్యాలయ ఏవో రఘురామయ్య తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను విజయవంతం చేయండి

గూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక షాందీమంజిల్‌లో ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించే స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను విజయంతం చేయాలని ఎఫ్ఎఫ్ఈ కమిటీ సభ్యులు అన్నారు. శనివారం షాందీ మంజిల్‌లో ఫ్రీడంఫైటర్స్ ఎక్స్‌పో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో స్వాతంత్రోద్యమం ఒక మహోజ్వల ఘట్టమన్నారు. చరిత్రకు అందని ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలుసుకుని, భారతీయుల పోరాట పటిమకు, త్యాగానికి గుర్తుగా దేశభక్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌రహీం, కాలేషా, నాశిన భాస్కర్‌గౌడ్, రవిరాఘవేంద్ర, కాలేషా నాజర్, జహంగీర్, యస్థాని, జమాలుల్లా, అన్వర్‌బాషా, సద్దాం హుస్సేన్, అల్లీహుస్సేన్, ఖాజాహుస్సేన్, షాహీద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ డీఈఈ మునిరవిచంద్ర శనివారం తెలిపారు.

విద్యుత్‌శాఖ ఏఈగా పూర్ణిమ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రూరల్ విద్యుత్‌శాఖ ఏఈగా పూర్ణిమ శనివారం బాధ్యతలు చేపట్టారు. చంద్రగిరిలో సబ్ ఇంజనీరుగా పనిచేస్తున్న ఈమె పదోన్నతిపై సూళ్లూరుపేట ఏఈగా వచ్చారు. ఆమెను లైన్ ఇన్‌స్పెక్టర్లు సురేంద్ర బాబు, అయాజ్, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

గురుకులం భవనానికి మోక్షం ఎప్పుడో?



గురుకుల పాఠశాల తరగతులు నిర్వహిస్తున్న వెంకటగిరిలోని విశ్వోదయ కళాశాల

బాలాయపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలానికి మంజూరు చేసిన బీసీ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనం లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో బాలాయపల్లి మండలానికి బీసీ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. జయంపు గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినా అనువైన భవనం లేకపోవడంతో నియోజకవర్గ కేంద్రమైన వెంకటగిరిలోని విశ్వోదయ కళాశాలలో తరగతులను అదే ఏడాది జూన్‌లో ప్రారంభించారు. అలాగే గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేశారు. అయితే మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో గురుకుల పాఠశాల మంజూరుకు కృషి చేసిన అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి గత ప్రభుత్వంలో సహకారం కొరవడడంతో జయంపులో గురుకుల పాఠశాల భవనం నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో జయంపులో గురుకుల పాఠశాల ఏర్పాటుపై అనుమానాలు నెలకొన్నాయి. అయితే గత ఎన్నికల ప్రచారం సందర్భంగా జయంపులో గురుకుల పాఠశాల భవనం నిర్మిస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇవ్వడంతో ఆశలు చిగురించాయి. ఈ మేరకు ఎమ్మెల్యే కురుగొండ్ల, అధికారులు స్పందించి జయంపులో గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్ట్

రూ.2.97 లక్షల సొత్తు, రెండు ఆటోల స్వాధీనం ● ఆరుగురి రిమాండ్



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ సంగమేశ్వరరావు

పెళ్లకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ట్రాన్‌ఫార్మర్లను చోరీ చేస్తున్న ముఠాలో నలుగురిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.97 లక్షల విలువైన రాగివైరు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. పెళ్లకూరు మండలం చెంబేడుకు చెందిన అనిల్, కిరణ్, రమణయ్య, నిరంజన్, అజయ్‌తో పాటు శ్రీకాళహస్తికి చెందిన ఓంకార్, శామ్యూల్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు శ్రీకాళహస్తి పెళ్లకూరు, నాయుడుపేట, దొరవారిసత్రం, ఓజిలి మండలాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులో ఉన్న రాగి వైరును అపహరించుకుని వెళ్లేవారు. పెళ్లకూరు మండలం రోసనూరు, చెన్నప్పనాయుడుపేట గ్రామాలతో పాటు వివిధ మండలాల్లో 26 ట్రాన్స్‌ఫార్మర్లను అపహరించినట్లు 11 కేసులు నమోదయ్యాయి. దీంతో నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో నిఘా పెట్టారు. సాంకేతికత ఆధారంగా అనిల్, కిరణ్, రమణయ్య, నిరంజన్‌తో పాటు వీరి నుంచి రాగి వైరు కొనుగోలు చేసే శ్రీకాళహస్తికి చెందిన బాబు, సత్యవేడుకు చెందిన తిరుమలను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఆరుగురు నిందితులను నాయుడుపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఇక చెంబేడుకు చెందిన అజయ్, శ్రీకాళహస్తికి చెందిన ఓంకార్, శామ్యూల్ పరారీలో ఉన్నారని, వారిని కూడా అరెస్టు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, ఏఎస్ఐ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తమ బిడ్డలు దొంగతనాలకు పాల్పడలేదని, అన్యాయంగా అరెస్ట్ చేశారంటూ నిందితుల తల్లిదండ్రులు, బంధువులు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు.

క్రిస్ సిటీ భూనిర్వాసితులకు అండగా ఉంటా: పాశం



రైతుల అభిప్రాయాలు వింటున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): క్రిస్ సిటీ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవడంతో పాటు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో శనివారం కోట, చిల్లకూరు మండలాల భూ నిర్వాసితులతో ఎమ్మెల్యే ముఖాముఖి నిర్వహించారు. రైతుల అభ్యంతరాలను విన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్ సిటీ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతుల కుటుంబాలకు పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. కొంతమందికి మాత్రమే పరిహారం వచ్చిం దని, మిగిలిన వారికి అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. అంతకుముందు కోట పట్టణంలో స్వర్గీయ నల్లపరెడ్డి గోపాలరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోట పట్టణంలో రూ.2.67 కోట్లతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేశారు. అల్లంపాడు పంచాయతీ పరిధిలోని చీకళ్లదిబ్బ వద్ద చిల్లకూరు రామసుబ్బారెడ్డి, సుశీలమ్మ దంపతుల జ్ఞాపకార్థం నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, తీగల సురేష్‌బాబు, భాస్కర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, కోటేశ్వరరెడ్డి, వాకా విజయభాస్కర్ రెడ్డి, దారా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయ చైర్మన్ పదవికి తిరుమూరును ప్రతిపాదించాం: నెలవల

ఓజిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పదవికి టీడీపీ సీనియర్ నాయకుడు తిరుమూరు సుధాకర్‌రెడ్డి పేరును ప్రతిపాదించినట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం శనివారం ప్రకటించారు. ఓజిలి మండలం నెమళ్ళపూడి దళిత కాలనీలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేసిన అనంతరం జరిగిన సభలో నెలవల మాట్లాడుతూ ఎమ్మెల్యే, పార్టీ నేతలతో చర్చించి ఆయన పేరును అధిష్టానానికి పంపామన్నారు. సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రచార సాధనాలు నాయకుల మధ్య అపోహలు సృష్టించి పలు పేర్లను తెరమీదకు తెస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన చేస్తున్నట్లు వివరించారు.

పరిహారం ఇచ్చాకే భూములను తీసుకోండి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణకు భూములు తీసుకుని నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పైసా ఇవ్వలేదని, పరిహారం బ్యాంక్ ఖాతాల్లో వేశాకే భూముల్లోకి దిగనిస్తామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు రైతులు తేల్చిచెప్పారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి, కొత్తపాళెం, విశ్వనాథపుర అగ్రహారం గ్రామాల రైతులకు చెందిన భూములు సాగరమాల రోడ్డు నిర్మాణ పనులకు వెళ్లాయి. పరిహారం ఇవ్వకపోవడంతో రైతులు అదే భూముల్లో వరి సాగు చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో శనివారం నెల్లూరుపల్లి కొత్తపాళెంలో గ్రామసభ నిర్వహించారు. భూములతో పాటు పంటలకు కూడా ఎకరానికి రూ.15వేల నుంచి రూ.30వేల వరకు పరిహారం ఇచ్చేందుకు రైతులను ఒప్పించారు. అయితే పరిహారం తమ బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తేనే భూముల్లోకి దిగనిస్తామని రైతులు తేల్చిచెప్పారు. రెవెన్యూ అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. సమాచారం తెలుసుకున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చేరుకొని భూమి, పంట పరిహారం రెండూ కలిపి 15 రోజుల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని, ఈలోపు పనులు జరగనివ్వాలని కోరారు. ఇందుకు రైతులు అంగీకరించకపోవడంతో సబ్ కలెక్టర్ వెళ్లిపోయారు. అంతకుముందు కొంతమంది రైతులు పరిహారం కోసం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో ఉన్న ముగ్గురి అరెస్టు

తడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో శ్రీకాళహస్తి రోడ్డులో ముగ్గురు వ్యక్తులు ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. వారిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద పదునైన పెద్ద కత్తిని ఉండడంతో పూర్తిస్థాయిలో విచారించగా చెన్నైకు చెందిన సతీష్‌కుమార్, హరీష్, నవీన్‌కుమార్‌గా తెలిసింది. చెన్నైలోని పలు పోలీస్‌స్టేషన్లలో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారు తడలో తిరుగుతున్నట్లు పోలీసులు చెప్పారు. ముగ్గురిని సూళ్లూరుపేట న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

పుత్తూరు వార్తలు

తృటిలో తప్పిన పెను ప్రమాదం

● రేషన్ బియ్యం తరలించే లారీకి బ్రేక్ ఫెయిల్
● పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఢీ కొట్టిన వైనం



పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఢీకొన్న లారీ

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే పుత్తూరు-కార్వేటినగరం రోడ్డులో తృటిలో పెను ప్రమాదం తప్పింది. శనివారం పౌరసరఫరాల శాఖ గోడౌన్ నుంచి బియ్యం లోడ్‌తో రేషన్ షాపులకు వెళుతున్న లారీకి బ్రేక్ ఫెయిల్ అయింది. మధ్యాహ్నం 1 గంట సమయంలో జరిగిన ఈ సంఘటనలో లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ లారీని అదుపు చేసేందుకు యత్నించి ఖాళీగా ఉన్న పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఢీకొట్టాడు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ట్రాఫిక్ కంట్రోల్ నియంత్రణకు పోలీస్ సిబ్బంది ఈ కంట్రోల్ రూమ్‌లో ఉండేవారు. ఇక్కడ ఓ ఏఎస్సై, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులు ఉంటారు ప్రమాద సమయంలో విధులు పూర్తి చేసుకుని వారు వెళ్లి పోవడంతో ప్రాణనష్టం జరగలేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు చిత్తూరు వెళ్లే ప్రయాణికులతో ఈ ప్రదేశం రద్దీగా ఉంటుంది. కంట్రోల్ రూమ్‌ను ఢీకొన్న క్రమంలో లారీ ముందుభాగం దెబ్బతింది. ప్రమాదం అనంతరం పోలీసులు సదరు వాహనాన్ని ఆర్టీసీ గ్యారేజీలో పెట్టారు. లారీకి బ్రేక్ ఫెయిల్ అయిందా.. గేట్ పుత్తూరుకు చెందిన డ్రైవర్ యుగంధర్ తప్పిదం ఏదైనా ఉందా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

జాతీయ స్థాయిలో పుత్తూరు వాకర్స్‌కు గుర్తింపు



ప్రమాణ స్వీకారం చేస్తున్న రావిళ్ల మాధవనాయుడు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో పుత్తూరు వాకర్స్‌కు గుర్తింపు రావడం అభినందమని ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రభావతి పేర్కొన్నారు. శనివారం పుత్తూరు వాకర్స్ భవనంలో జరిగిన ఇంటర్నేషనల్ వాకర్స్ డిస్ట్రిక్ గవర్నర్ బాడీ అధ్యక్ష, డైరెక్టర్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ పుత్తూరు వంటి చిన్న పట్టణంలో వాకర్స్ అసోసియేషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ గవర్నర్‌గా రావిళ్ల మాధవ నాయుడు, డిప్యూటీ గవర్నర్‌గా లక్ష్మీనారాయణ మూర్తి(పుత్తూరు), వి.శాంతి(తిరుపతి), వి.భాస్కర్‌రాజు(బెంగళూరు), ఏజీ పాండియన్(తమిళనాడు), డైరెక్టర్లుగా పి.రామచంద్రయ్య నాయుడు, రఘునాథ రెడ్డి, శ్రీరాములు, కోశాధికారిగా పి.ఎస్.కృష్ణం రాజు, కార్యదర్శిగా మునికృష్ణయ్య ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాసన్ ఐ కేర్, సంకల్ప వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ డాక్టర్ పి.రవిరాజు, ఏరియా త్రి వైస్ ప్రెసిడెంట్ కుమారస్వామి గౌడ్, రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణ, గవర్నర్ 102 రామరాజు, శరత్‌కుమార్ రాజు, లక్ష్మీనారాయణ, పుత్తూరు అధ్యక్ష, కార్యదర్శులు కేఎల్ మూర్తి, రఫీ, ఉషోదయ వాకర్స్ ఫౌండర్ కోనేటి రవిరాజు, శ్రీధర్ రాజు, శ్రీనివాసులు, మునికృష్ణయ్య, కోశాధికారి గుణశేఖర్‌రెడ్డి, గోపి, కుప్పయ్య శెట్టి, దశరథరామయ్య, సుబ్రమణ్యం నాయుడు, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన బీసీ వెల్ఫేర్ ఆఫీసర్



ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో చర్చిస్తున్న జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ చంద్రశేఖర్ శనివారం నగరి ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. బీసీ బాలికల హాస్టళ్లకు మరమ్మతులు చేపట్టి వసతులు మెరుగుపరచాలని సూచించారు.

ఆగిన ఎండీయూ వాహనాలు

● గందరగోళంలో రేషన్‌కార్డుదారులు

పుత్తూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేసే ఐదు ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలు ఆగిపోవడంతో సరకుల పంపిణీ గందరగోళంగా మారింది. మూడు నెలల క్రితం మండలంలోని 15 ఎండీయూ వాహనాల్లో ఐదుగురు వాహన యజమానులు సరకులు పంపిణీ చేయలేమని రాజీనామా చేశారు. దీంతో మున్సిపాలిటీ పరిధిలోని గేట్ పుత్తూరు, లక్ష్మీనగర్, నందిమంగళం, గోపాలకృష్ణాపురం, పరమేశ్వరం మంగళంలలో ప్రత్యామ్నాయంగా ఆయా పరిధిలో చౌకదుకాణాలకు పంపిణీ బాధ్యతలను అప్పగించారు. మండల పరిధిలో అయితే పర్వాలేదుకాని పట్టణంలో మాత్రం కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వినియోగదారులు బయోమెట్రిక్ ద్వారా రేషన్ షాపు/ఎండీయూ నుంచైనా సరుకులను తీసుకోవచ్చు. ఇక్కడే సమస్య తలెత్తుతోంది. సరుకు వచ్చిన వెంటనే వేరే వీధుల కార్డుదారులు కూడా తీసుకుంటున్నారు. దీంతో స్టాక్ అయిపోవడంతో ఆ ప్రాంతంలోని కార్డుదారులు మరో డీలరును వెతుక్కోవాల్సి వస్తోంది. ఇకపోతే ప్రతినెలా 20 నుంచి 30వ తేదీలోగా పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం మండలాలకు సరుకులను విధిగా చౌకదుకాణ డీలర్లకు పంపిణీ చేస్తున్నామని గోడౌన్ డీటీ మునివేలు తెలిపారు. డీలర్ల నుంచి కార్డుదారులకు చేరవేసే బాధ్యత తమది కాదన్నారు.

స్థానిక అభివృద్ధి పనులకు ఇసుక ఇవ్వాలని నిరసన



స్వర్ణముఖినదిలో వాహనాలు రాకుండా హిటాచీని అడ్డంగా పెట్టిన రీచ్ ప్రతినిధులు

కోట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి స్వర్ణముఖినది నుంచి స్థానిక అభివృద్ధి పనులకు ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాలంటూ శనివారం స్థానికులు ఆందోళన చేపట్టారు. గూడలి పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించేందుకు రీచ్‌కు కేటాయించిన స్థలంలోకి స్థానికులు వెళ్లారు. అక్కడే ఉన్న రీచ్ ప్రతినిధులు దారికి అడ్డంగా హిటాచీ, ఎక్స్‌కవేటర్లను అడ్డంగా పెట్టడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎస్ఐ పవన్‌కుమార్ స్వర్ణముఖినది వద్దకు చేరుకొని స్థానికులతో చర్చించారు. ఇసుకను తరలించేందుకు అనుమతి ఇస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు వెళ్లిపోయారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

గూడూరు అర్బన్, చిల్లకూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం కుందకూరు సమీపంలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో నిర్వాహకులు అన్నదానం చేశారు. చిల్లకూరు మండ లం కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషే కాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యే కంగా అలంకరించి పల్లకీసేవ జరిపి ఆలయ ఆవరణలో ఊరేగిం చారు.

సీఐఎస్ఎఫ్ సహాయ ఇన్‌స్పెక్టర్లకు సన్మానం



వెంకటరావు, వేణుగోపాలరావుతో కమాండెంట్ సంజీత్ కుమార్, డిప్యూటీ, అసిస్టెంట్ కమాండెంట్‌లు నీలేష్ గౌర్, లక్ష్మణ్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో సీఐఎస్ఎఫ్ సహాయ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసిన గున్నం వెంకటరావు, పీతల వేణుగోపాల్ రావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. శనివారం షార్‌లోని సీఐఎస్ఎఫ్ బ్యారక్ హాలులో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సంజీత్ కుమార్ కమాండెంట్ ఆధ్వర్యంలో వెంకటరావు, వేణుగోపాలరావును ఘనంగా సన్మానించారు. 40 ఏళ్లపాటు వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ నీలేష్ గౌర్, అసిస్టెంట్ కమాం డెంట్ సన్‌చిట్ లక్ష్మణ్, జేఏవో సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

సత్యవేడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రామస్వామి తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో రోడ్డు ప్రమాదాల నివారణ - ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యం

● అందరికీ ఉచిత లడ్డూ ప్రసాదం ● మహిళలకు పసుపు కుంకుమ
● మహాశివరాత్రి వేడుకలపై మంత్రుల సమీక్ష



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులను సంతృప్తికర దర్శనం కల్పించడమే లక్ష్యమని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై శనివారం శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ వివరాలను మంత్రులు మీడియాకు వెల్లడించారు. ఈ నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ తావులేకుండా నిర్వహిస్తామన్నారు. ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం ఉత్సవాల్లో భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించామని తెలిపారు. మహిళలకు జ్ఞానప్రసూనాంబిక అనుగ్రహ ప్రసాదంగా రవిక, గాజులు, పసుపు, కుంకుమను సారెగా ఇవ్వనున్నట్లు చెప్పారు. వీవీఐపీ, వీఐపీల కోసం ప్రత్యేక టైంస్లాట్ కేటాయించామన్నారు. పిల్లలు తప్పిపోతే సులభంగా గుర్తించేలా జియో ట్యాగింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వామి అమ్మవార్ల కల్యాణం రోజున పట్టువస్త్రాలు సమర్పించేందుకు సీఎం చంద్రబాబును ఆహ్వానించామన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు బైపాస్ రోడ్డు నుంచి తాత్కాలిక రోడ్డు నిర్మించేందుకు అనుమతించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి, నాయకులు టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

స్థానికులకు ఉచిత దర్శనం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానికులకు శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనాన్ని ఉచితంగా కల్పిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శివరాత్రి మరుసటి రోజున స్థానికుల కోసం ప్రత్యేకంగా ఉచిత క్యూలైన్ విధానం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి 24 మంది సభ్యులతో సేవా సమితిని ఏర్పాటు చేస్తామన్నారు.

కల్లుగీత కార్మికులకు మూడు మద్యం షాపులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో కల్లుగీత కార్మికులకు మూడు మద్యం షాపులను ప్రభుత్వం కేటాయించిందని ఎక్సైజ్ సీఐ సురేంద్రబాబు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఒక్కో షాపు చొప్పున కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలను కేటాయించిందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 5వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో లేదా నేరుగా ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి ఆలయం ఎదుట
దళారీల బరితెగింపు
- మోసాలు వద్దన్న హోంగార్డుపై ఎదురుదాడి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఎదుట భక్తులను మోసగించే ఇద్దరు దళారీలు విధుల్లో ఉన్న హోంగార్డుపై మాటలతో ఎదురుదాడి చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ స్వామివారి రథం ఎదుట కొందరు దళారీలు లాకర్లు ఏర్పాటు చేసుకుని రోడ్లో వచ్చే భక్తులను బలవంతంగా పిలుస్తుంటారు. నమ్మి దగ్గరకు వెళ్లిన భక్తులకు నకిలీ నేతిదీపాలు, చెట్టుకు పసుపుదారం కడితే దోషం పోతుందంటూ మోసగిస్తుంటారు. ఇలాంటి మోసాలను అరికట్టేందుకు రెండ్రోజుల క్రితం వన్‌టౌన్ సీఐ అక్కడి దళారీలను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. భక్తులను మోసగించేవారిపై భిక్షాల గాలిగోపురం హోంగార్డుకు విధులు కేటాయించి నిఘా ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం రాజేష్ అనే హోంగార్డు అక్కడ విధుల్లో ఉండగా కొందరు దళారీలు భక్తులను బలవంతంగా తమ వద్దకు పిలుస్తూ నకిలీ నేతిదీపాలతో మోసాలకు పాల్పడ్డారు. భక్తులను లాకరు పేరుతో పిలిచి మోసాలు చేయడం ఆపుకోవాలని హోంగార్డు వారికి సూచించాడు. దాంతో ముని, ప్రవీణ్ అనే ఇద్దరు దళారీలు మాటలతో ఎదురుదాడికి దిగారు. రెండ్రోజుల ముందే పోలీస్‌స్టేషన్‌కు పోయాం.. ఏమైపోయింది.. మేము చేసే పని చేసి తీరుతాం.. నువ్వు ఏం చేస్తావో చేసుకో అంటూ నడిరోడ్డుపై భక్తులందరూ చూస్తుండగానే హోంగార్డుపై దళారీలు ధిక్కారస్వరాన్ని వ్యక్తం చేశారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



అగ్నిగుండంలో అమ్మవారి రూపం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహదూరుపేటలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారికి పలు రకాల అభిషేక పూజలు చేసి, విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అగ్ని ప్రతిష్ఠ, అమ్మవారి ఒడి బాల సమర్పణ, రాత్రి అగ్నిగుండ మహోత్సవం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో అగ్నిగుండంలో నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండం ప్రారంభంలో అమ్మవారి ఆకార దర్శనం కనిపించడంతో భక్తులు అమ్మవారిని స్మరించుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీవాసవి ఆర్య వైశ్య సమాజం, వాసవి మహిళా సంఘం, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

జనసేనకు ప్రాధాన్యమివ్వరా?
- మంత్రి సత్యప్రసాద్‌కు పార్టీ నేతల ఫిర్యాదు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన శ్రేణులకు కనీస గౌరవం లభించడం లేదని ఆ పార్టీ నాయకులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. శ్రీకాళహస్తి పురపాలకసంఘ కార్యాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలపై శనివారం మంత్రి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జనసేన నాయకులు మంత్రిని కలిసి తమ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుతకు ఈ సమావేశంపై సమాచారం ఇవ్వలేదని వాపోయారు. స్థానికంగా రోడ్ల పనులు, వివిధ కాంట్రాక్టుల్లో కూడా తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ముక్కంటి ఆలయ కారు పార్కింగ్ టెండర్‌లో రూ.1.58కోట్లతో ప్రథమస్థానంలో నిలిచామని.. కానీ ఆ కాంట్రాక్టును అప్పగించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఇరుపార్టీల నేతల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. త్వరలోనే చర్చించి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి వారికి సమాధానం ఇచ్చారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా రమేష్

కేవీబీపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగత్తూరు గ్రామానికి చెందిన డాక్టర్ పాలమంగళం రమేష్‌కు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా స్థానం కల్పించారు. దీంతో మండలంలోని ఎస్సీ, ఎస్టీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

జీపాళెంలో ఇసుక అక్రమ తవ్వకాలు



జీపాళెంలో స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న దృశ్యం

రేణిగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జీపాళెం పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గతంలో ఇదే ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌ల ద్వారా ఇసుకను తీస్తుండడంతో ఏర్పడిన గుంతల్లో గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు పడి మృతి చెందారు. దీంతో గ్రామస్తులు పెద్దయెత్తున ఆందోళనలు చేశారు. అయితే ఇదే ప్రాంతంలో శనివారం ఇసుక తవ్వకాలు నిర్వహించారు. ఇసుకను అక్రమంగా తవ్వి రహస్య ప్రదేశాలలో డంపు చేస్తున్నట్లు తెలిసింది. రాత్రి సమయంలో ఎక్స్‌కవేటర్ సాయంతో ఇసుక తవ్వకాలు చేస్తూ పగటి సమయంలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.

ఊరందూరులో మంత్రులచే పింఛన్ల పంపిణీ
● హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



ఆలయం వద్ద మంత్రులు సత్యప్రసాద్, రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఊరందూరు హరిజనవాడలో ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను శనివారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి లబ్ధిదారులకు నేరుగా అందజేశారు. మంత్రులకు స్థానికులు నీరాజనం పట్టారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను ఆప్యాయంగా పలుకరిస్తూ పింఛన్లు అందజేసి, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. మంత్రులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను చేపడుతున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేల నుంచి రూ.4వేలకు పింఛన్లను పెంచారన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, నాయకులు నరసింహయాదవ్, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు. తొట్టంబేడు మండలం కొణతనేరి, ఇలగనూరులో మండలాధ్యక్షుడు గాలి మురళీ నాయుడు పింఛన్లు పంపిణీ చేశారు.

ముక్కంటి సేవలో మంత్రులు

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని మంత్రులు రామనారాయణరెడ్డి, సత్యప్రసాద్ దర్శించుకున్నారు. అధికారులు దక్షిణ గోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు మంత్రులను శేషవస్త్రంతో సత్కరించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నదాన మండపాన్ని మంత్రులు పరిశీలించారు. స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించి పదార్థాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

పీఆర్వో, సీఆర్వో కార్యాలయాల ప్రారంభం

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని నాలుగవ గేటు వద్ద నూతనంగా నిర్మించిన పీఆర్వో, సీఆర్వో కార్యాలయాలను మంత్రులు ప్రారంభించారు. మంత్రులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం లాంఛనంగా స్వామి అమ్మవార్ల చిత్రపటానికి పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చకుంటే సమ్మె బాట

రేణిగుంట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రేణిగుంట పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించుకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. శనివారం పంచాయతీ కార్మికులు మెరుపు సమ్మె నిర్వహించారు. అనంతరం కార్యదర్శి మణికి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన కార్యదర్శి పది రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై పోక్సో కేసు

రేణిగుంట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై రేణిగుంట అర్బన్ పోలీసు స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ శనివారం మీడియాతో మాట్లాడుతూ... అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలం జొన్నలదిన్నె గ్రామానికి చెందిన నవీన్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కూలీ పనుల నిమిత్తం రేణిగుంటకు వచ్చిన అతను పనికివెళ్లే ముందు పాత చెక్‌పోస్టు వద్దనున్న ఓ చర్చిలో ప్రార్థన చేసుకునేందుకు వెళ్లాడు. అదే సమయంలో ఏడేళ్ల బాలిక సెల్‌ఫోన్‌తో ఆడుకుంటుండగా ఈ యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. గుర్తించిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదుచేయడంతో చికిత్స నిమిత్తం బాలికను రుయా ఆసుపత్రికి తరలించి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వంతెన కింద ఇరుక్కున్న లారీ



వంతెన వద్ద ఆగిపోయిన లారీ

రేణిగుంట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పాత చెక్‌పోస్టు కూడలి రైల్వే వంతెన కింద లారీ ఇరుక్కుని ట్రాఫిక్ జామ్ అయిన సంఘటన శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు శ్రీకాళహస్తి వైపు నుంచి తిరుపతి వైపు భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటు చేసిన ఇనుప కమ్మీల కింద లారీ ఇరుక్కోవడంతో రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు లారీని వెనక్కి తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నాలుగేళ్ల తర్వాత నీ పరిస్థితి ఏంటి!
● కరకంబాడి పంచాయతీ కార్యదర్శికి వైసీపీ ప్రజాప్రతినిధుల వార్నింగ్



పంచాయతీ కార్యదర్శి రమేష్‌పైకి దూసుకొచ్చి హెచ్చరికలు చేస్తున్న వైసీపీ ప్రజాప్రతినిధులు

రేణిగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల తర్వాత నీ పరిస్థితి ఏంటీ అంటూ కరకంబాడి పంచాయతీ కార్యదర్శిని వైసీపీ ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శనివారం ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తారకరామా నగర్‌లో గతంలో ఎన్వోసీలు ఇచ్చినా ఆన్‌లైన్‌లోకి ఎక్కించలేదని ఎంపీటీసీ కన్నయ్య అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కరకంబాడి పంచాయతీ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గతంలో ఉన్న కార్యదర్శులు ఒకే ఇంటికి రెండు మూడు ఎన్వోసీలు ఇచ్చారని, ఈ కారణంగా ఆన్‌లైన్‌లోకి ఎక్కిస్తే సమస్యలొస్తాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అని చెబుతుండగా ఒక్కసారిగా వైసీపీ ప్రజాప్రతినిధులు ఆయన ప్రసంగానికి అడ్డుతగిలారు. ఆవేశంతో ఊగిపోతూ కార్యదర్శిపైకి దూసుకెళ్లారు. నాలుగేళ్ల తర్వాత నీ పరిస్థితి ఏంటో చూసుకో అంటూ బెదిరింపులకు దిగారు. దీంతో అక్కడే ఉన్న పలువురు అధికారులు వారిని సముదాయించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. అరుపులు, కేకలతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆఖరికి పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్దుబాటు చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అంతకు ముందు ఎంపీపీతోపాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులకు కనీసం గౌరవం కూడా ఇవ్వకుండా అధికారులు, కార్యదర్శులు వ్యవహరిస్తున్నారని నిలదీశారు. జడ్పీటీసీ సభ్యురాలు సంధ్య, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఈవోపీఆర్డీ ప్రభురావు, పీఆర్ ఏఈ రమణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సిద్ధార్థ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


ఇంటి స్థలాల కోసం భూమి ఆక్రమణ



ఇంటి స్థలాల కోసం ప్రభుత్వ భూమిలో చెట్లు, పుట్ట చదును చేస్తున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు ఇంటి స్థలాల కోసం మండల కేంద్రమైన బుచ్చినాయుడు కండ్రిగలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఆక్రమించారు. సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ దళితులు ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఒకే ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు కలిసి కాపురాలు చేస్తున్నారని తెలిపారు. మండల కేంద్రంలోని సర్వే నెంబర్లు 252, 253లో ప్రభుత్వ భూమిని ఇంటి స్థలాలుగా ఇవ్వాలని పలు దఫాలుగా రెవెన్యూ అధికారులను కోరినా పట్టించుకోలేదని తెలిపారు. ఇదే భూమిలో తప్పుడు పత్రాలు సృష్టించి భూమికి ఫెన్సింగ్ వేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. అందుచేతనే ఇంటి స్థలాలు లేని దళితులందరూ కలసి ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తక్షణమే ఇంటి స్థలాలు లేని దళితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ డే



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయరామారావు వీధిలో గల శ్రీచైతన్య పాఠశాలలో స్పోర్ట్స్‌డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రీప్రైమరీ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఏజీఎం సురేష్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, ఏవో శివ, డీన్ శంకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం వేదోక్తంగా తైలాభిషేకం నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి, గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే స్థలాలను గుర్తించి, వాటిని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించడం వల్ల కలిగే హానిని యువకులకు వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఊంజలసేవ

నారాయణవనం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు సామూహిక అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో 3వతేదీ వసంత పంచమిని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. ఉదయం 7.15 గంటలకు విఘ్నేశ్వరపూజ, అక్షరాభ్యాస కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యార్థులకు పలక, బలపం అందజేయనున్నట్లు తెలిపారు.

ఏకలవ్య గురుకులంలో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సీబీఎస్ఈ బోధనలో ఆరవ తరగతి ప్రవేశానికి గాను గిరిజన బాల బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు 30, బాలికలకు 30 సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 19వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష ఈ నెల 25వ తేదీన ఉంటుందన్నారు. ఇతర వివరములకు 94504 21570 నెంబరును సంప్రదించాలన్నారు.

ఫారెస్టు వాచర్‌ను ఢీకొన్న ఎన్‌ఆర్‌ఐ కారు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో వాచర్‌గా పనిచేస్తున్న మునీంద్ర(45)ను ఓ ఎన్‌ఆర్‌ఐ కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని కేఎంపల్లికి చెందిన మునీంద్ర తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం వద్ద ఉన్న చెక్‌పోస్టులో వాచర్‌గా పనిచేస్తుంటాడు. శనివారం రాత్రి చెక్‌పోస్టు సమీపంలోని జాతీయ రహదారిపై వాహనాలను పరిశీలిస్తూ నిలబడ్డాడు. విజయవాడకు చెందిన ఓ వ్యక్తి ఆస్ట్రేలియాలో ఎన్‌ఆర్‌ఐగా స్థిరపడ్డాడు. ఆయన కారులో తిరుపతి వైపుగా వెళుతూ మునీంద్రను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు కరకంబాడి వద్ద ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు డ్రైవర్‌తో సహా కారును అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ఆలస్యంగా పింఛన్ల పంపిణీ



సర్వర్ మొరాయించడంతో వేచి ఉన్న పింఛనుదారులు

కేవీబీపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి సర్వర్ మొరాయించింది. దీంతో పింఛన్ల పంపిణీ కాస్త ఆలస్యమైంది. మండలంలో సుమారు 6,665 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా మధ్యాహ్నానికి 60శాతం మాత్రమే పంపిణీ జరిగింది. అదికూడా ఇంటింటికి తిరిగే పరిస్థితి లేక సిగ్నల్ రాక ఎక్కడ వస్తే అక్కడ లబ్ధిదారులకు సిబ్బంది పింఛన్లు అందజేశారు. ఎట్టకేలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

నారాయణవనంలో...

నారాయణవనం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో నారాయణవనం జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ శనివారం వృద్ధులకు, ఒంటరి మహిళలకు, ప్రత్యేక ప్రతిభావంతులకు పింఛన్లు పంపిణీ చేశారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు భాస్కరన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ గిరికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి నీటి సరఫరా చేసే పెద్దపైపులైను 800 జీఆర్పీ మద్రాసు రోడ్డు, చిలకమ్మ ఆలయం వద్ద మరమ్మతులకు గురైందన్నారు. దానిని బాగు చేసేందుకు ఆదివారం పట్టణంలో నీటి సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.